# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 139 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం, 15 ఏప్రిల్ 2026 | పేజీలు : 4




డ్రాగన్ మూవీలో ఆలియా

4



## జనగామలో
# మరో రాజ్యాంగం..!

- డ్రగ్స్, అక్రమ మద్యంతో యువత చిత్తు
- పోలీసులు పేదలకు అండగా నిలవాలి
- 25బెల్ట్ షాపులు వారంలోపు మూసేయాలి
- లేకపోతే దళిత, మహిళా సంఘాలతో ఉద్యమిస్తాం..
- కలెక్టరేట్లో మాట్లాడే పరిస్థితి లేదు
- ప్రజా సమస్యలకు వినే పరిస్థితి లేదు
- కలెక్టర్‌పై ఎమ్మెల్యే పల్లా తీవ్ర విమర్శలు

2

దేశమంతా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుంటే.. జనగామలో మాత్రం మరో రాజ్యాంగం కొనసాగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సంచన కామెంట్స్ చేశారు. జనగామలో బెల్ట్ షాపులు, సిండికెట్ దోపిడీ, దళిత మహిళలపై వివక్ష, అధికారుల నిర్లక్ష్యం ఇలా ఒకటి కాదు రెండు కాదు ఎన్నో ఉన్నాయని చెప్పుకొచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి నంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

*- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*

## అంబేద్కర్ ఆశయాలతో
# ముందుకు సాగాలి

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు.

2





# దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు

- బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి
- దళితులు అభ్యున్నతికి పెద్దపీట
- దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు
- అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేద్కర్ పాత్ర అంతే ఉంద న్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్ లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్ లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేక పోతున్నారంటూ విమర్శించారు.

# జనగామలో మరో రాజ్యాంగం!

- డ్రగ్స్, అక్రమ మద్యంతో యువత చిత్తు
- పోలీసులు పేదలకు అండగా నిలవాలి
- బెల్ట్ షాపులు వారంలోపు మూసేయాలి
- లేకపోతే దళిత, మహిళా సంఘాలతో ఉద్యమిస్తాం..
- కలెక్టరేట్లో మాట్లాడే పరిస్థితి లేదు
- ప్రజా సమస్యలకు వినే పరిస్థితి లేదు.
- కలెక్టర్‌పై ఎమ్మెల్యే పల్లా తీవ్ర విమర్శలు



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** దేశమంతా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుంటే.. జనగామలో మాత్రం మరో రాజ్యాంగం కొన సాగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సంచన కామెంట్స్ చేశారు. జనగామలో బెల్ట్ షాపులు, సిండికెట్ దోపిడీ, దళిత మహిళలపై వివక్ష, అధికారుల నిర్లక్ష్యం ఇలా ఒకటి కాదు రెండు కాదు ఎన్నో ఉన్నాయని చెప్పుకొచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించినంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. జనగామలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగ సమానత్వం, దళితుల హక్కులు, అక్రమ మద్యం, అధికారుల వైఖరి వంటి అంశాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అంబేద్కర్ చెప్పిన బోధనలు వినడమే కాదు..అవి ఆచరణలో కనిపించాలి. సమాజంలోని అన్ని వర్గాలకు హక్కులు దక్కాలనే ఉద్దేశంతో అంబేద్కర్ రాజ్యాంగం రచించారు. నేడు రాజ్యాంగం గురించి చెప్పేవారు ఎక్కువయ్యారు. కానీ ఆచరించే వారు తక్కువయ్యారు. అంబేద్కర్ జయంతి సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎందుకులేరని ప్రజలు నన్ను ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులకు 10వ తరగతి పాస్ అయితే రూ.5 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ.10 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.25 వేలు, పీజీ పాస్ అయితే రూ.1 లక్ష, పీహెచ్‌డీ పాస్ అయితే రూ.5 లక్షలు ఇస్తామన్నారు. అవి అమలయ్యాయా అని ప్రభుత్వాన్ని అడగాలి. జనగామలో ఒక రాజ్యాంగం, మిగతా ప్రాంతాల్లో మరో రాజ్యాంగం నడుస్తున్నట్లుగా పరిస్థితి ఉంది. కలెక్టర్, పోలీసులు, అధికారులు రాజ్యాంగాన్ని సమానంగా అమలు చేయడం లేదనే భావన ప్రజల్లో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద తెలంగాణ సాయుధ పోరాటం జనగామ గడ్డపై జరిగింది. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ పోరాటాల గడ్డ మీద అంబేద్కర్ రాజ్యాంగం పనికి రావడం లేదన్న పరిస్థితి ఉంది. కానీ ఆ రాజ్యాంగం జనగామలో ఎందుకు పని చేయడం లేదో సమాధానం చెప్పాలి. సర్దార్ పాపన్న పుట్టిన గడ్డలో కూడా రాజ్యాంగ హక్కులు దక్కడం లేదు. గతంలో దళిత మహిళకు కలెక్టర్ కార్యాలయం ఎదుట వనిత టీ స్టాల్ ఏర్పాటు చేసి రూ.3 లక్షల రుణం ఇచ్చారు. ఇప్పుడు కొత్త కలెక్టర్ వచ్చాక ఆ సహాయాన్ని పూర్తిగా తీసేశారు. పక్కన అదే ప్రాంతంలో ఇతర వర్గాల వారికి ఏసీతో కూడిన పర్మిట్ రూమ్‌లు నిర్బంధం లేకుండా నడుస్తు న్నాయి. ఇది రాజ్యాంగ సమానత్వానికి విరుద్ధం. జనగామలో 11 మద్యం షాపులు ఉన్న చోట ధర తక్కువగా ఉందని చెప్పి కొత్తగా 25 బెల్ట్ షాపులు పెట్టారు. అనేక బెల్ట్ షాపుల్లో ఉదయం 4:30 గంటలకే మద్యం అమ్ముతున్నారు. ఇది జనగామ రాజ్యాంగం ప్రకారమే జరుగుతోందా అని ప్రశ్నిస్తున్నాను. సాధారణంగా రూ.180కు దొరికే మద్యం ఇక్కడ రూ.220కు అమ్ముతున్నారు. ఆ అదనపు రూ.40 ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయి.? జనగామలో 25 బెల్ట్ షాపులు ఉన్నాయి. ఏ రాజ్యాంగం ప్రకారం అవి నడుస్తున్నాయి? అనేక దాబాల్లో రూ.180 మద్యం రూ.230, రూ.240కు అమ్ముతు న్నారు. అడిగే నాథుడు ఎవరూ లేరు.. ఆదుకున్నే నాధుడు మాత్రం ఉన్నాడు. అందుకే ఇక్కడ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం కావాలని కోరుతున్నాను.

## కలెక్టర్‌పై విమర్శలు...

ఇక జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై కూడా ఎమ్మెల్యే పల్లా విమర్శలు చేశారు. 'ఇక్కడ కలెక్టర్ ఉన్నారు కానీ వినే పరిస్థితి లేదు. దళిత మహిళలపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇవాళ రేపో ఆ షాప్ కూడా తీసేస్తామంటున్నారు. పక్కనే ఉన్న పర్మిట్ రూమ్ మాత్రం బ్రాహ్మణంగా నడుస్తోంది. దానికి అంబేద్కర్ రాజ్యాంగం అవసరం లేదా అని ఆలోచించాలి. జనగామ కలెక్టర్ కు ఐదు అధికారుల పోస్టులు ఉన్నాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్వో, డీఈవో, డీఆర్‌డీఓ ఉన్నాయి. కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడే పరిస్థితి లేదు, పని చేసే పరిస్థితి లేదు. అంబేద్కర్ మీటింగ్‌కు టైమ్ ఇవ్వనప్పుడు ఇంకెవరికి ఇవ్వరు. ప్రజా సమస్య కోసం వెళ్తే వినే ఓపిక లేదు..' అంటూ విమర్శించారు. 'జనగామలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చట్టబద్ధంగా భూమి, నిధులు మంజూరయ్యాయి. అయినా కొత్త అప్లికేషన్ పేరుతో పనులు అడ్డుకుం టున్నారు. జనగామ చట్టం ప్రకారం ప్రత్యేకంగా కొత్త అప్లికేషన్ అవసరమా? ఎవరి డబ్బు ఎవరికో ఇవ్వమని అడుగుతున్నాం? మనందరికీ హక్కులు లేవా? అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కడితే జనగామ ప్రజలందరికీ ఉపయోగపడుతుంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగం కావాలని బాధతో మాట్లాడుతున్నాను. నేను ప్రతిపక్ష ఎమ్మెల్యే కావడం వల్లే జనగామ రాజ్యాంగం నడుస్తోంది. పక్కన ఉన్న పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్‌లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తోంది. ఏ వర్గం కోసం, ఏ మతం కోసం పనిచేశారో ముఖ్యం కాదు.. అంబేద్కర్ ప్రజల కోసం పని చేశారు. జనగామలో దళితుల హక్కుల కోసం ఏం దక్కకపోయినా మీ ముందు నేను నిలబడి కొట్లాడుతాను.

## బెల్ట్ బంద్ చేయాలి..

వారం రోజుల్లో జనగామలో నడుస్తున్న బెల్ట్ షాపులు, సిండికేట్లు బంద్ కావాలి.. లేకుంటే తామే పోరాటం చేసి బంద్ చేయిస్తామని ఎమ్మెల్యే పల్లా పోలీసులకు అల్టిమేట్ ఇచ్చారు. 'డ్రగ్స్, అక్రమ మద్యం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోంది. పిల్లల భద్రత కోసం, వారి భవిష్యత్తు కోసం అమాయక కుటుంబాలు కుటుంబాలు కష్టపడుతున్నాయి. కానీ పిల్లలు తప్పు దారిలోకి వెళ్తున్నారు. తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. పోలీసులు పేద ప్రజలకు అండగా నిలవాలి. దళిత మహిళలపై దాడులు ఆపాలి. దళిత మహిళల కోసం మాట్లాడిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యా యం. స్టేషన్ బెయిల్ ఇచ్చే అవకాశం ఉన్నా, ఇవ్వకుండా వేధింపులు చేస్తున్నారు. అక్రమ బెల్ట్ షాపులు వారంలోపే మూసివేయాలి. ఏసీపీ, డీసీపీ కార్యాలయాల ముందు ఉన్న షాపులపై కూడా చర్యలు తీసుకోవాలి. అధికారులు చర్యలు తీసుకోకపోతే దళిత, మహిళా సంఘాలతో కలిసి ఉద్యమం చేస్తాం... వాటి మూసివేస్తాం..' అని పల్లా స్పష్టం చేశారు. డీసీపీ అట్టడుగు వర్గాల నుంచి కష్టపడి వచ్చిన వారు.. ఆయనపై మీద నమ్మకం ఉంది. 'బెల్ట్ తీస్తే..' మీకు జనగామ ప్రజలు నీరాజనం పలుకుతారు. జనగామలో జనగామ రాజ్యాంగం కాదు.. అంబేద్కర్ రాజ్యాంగమే అమలవ్వాలి. ప్రజలు ఓటుతో గెలిపించారు, వారి హక్కులు కాపాడటం నా బాధ్యత..' అని పల్లా పేర్కొన్నారు.







# అంబేద్కర్ ఆశయాలతో ముందుకు సాగాలి

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బి. ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి మునిసిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొని పూలమాల వేసి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డా. బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చూపిన మార్గంలో నడిచి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్య, సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే సమాజంలో మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. అనంతరం ఏసిపి పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ గోపీరాం, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఇతర అధికారులు, షెడ్యూల్డ్ కులముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు కూడా డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి అంజలి ఘటించి, నివాళులు అర్పించారు.





# అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు నడవాలి

- మాజీ ఎంపీ పసునూరు దయాకర్
- తూర్పుకోటలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ తూర్పు కోట జంక్షన్ లో ఆదర్శనగర్ కాలనీ పెద్దలు, యూత్ పిల్లల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తూర్పు కోట లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అంబేద్కర్ విగ్రహం మాజీ ఎంపీ పసునూరి దయాకర్ చేతుల మీదుగా శిలాఫలక ఆవిష్కరణ మరియు విగ్రహ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు, స్థానిక కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, మాజీ డిప్యూటీ మేయర్ కక్కే సారయ్య, మాజీ పిఎస్సిఎస్ చైర్మన్ అచ్చ వీరేష్ బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ నాడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని, పేదరికం ఎదుర్కొని వెన్ను తిరగకుండా ఎంతో దీక్షతో చదువుకొని దేశం గర్వించదగ్గ స్థాయికి ఒక దళిత సామాజిక వర్గం నుంచి నిలబడిన మహా మూర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఈరోజు దేశం నడుస్తుందంటే అది రాజ్యాంగం వల్లనే అంతటి రాజ్యాంగాన్ని నిర్మించిన మహా మేధావి డాక్టర్ అంబేద్కర్ అని కొని ఆడారు కేవలం దళితుల వాడే కాకుండా వెనుకబడిన తరగతులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అన్ని వర్గాలకు రాజ్యాంగంలో అవకాశాలు కల్పించి అందరిని సమాజంలో ముందుకు తీసుకు వచ్చినటువంటి నాయకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన స్ఫూర్తితో నేటి యువత చదువు మీద ప్రత్యేక శ్రద్ధ చూపించి మత్తు ప్రాణయాలకు జూదంకు తదితర చెడు లక్షణాలకు దూరంగా ఉంటూ దేశ అభివృద్ధిలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్ తూర్పుకోట వాసులు ఎవరి మీద ఆధారపడకుండా స్వచ్ఛందంగా ఇంత ఖర్చుతో కూడిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఎంతో ఆదర్శంగా తీసుకొని నేడు ఇంత ఘనంగా ఆవిష్కరించినందుకు ఆ బృందాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ డిప్యూటీ మేయర్ కక్కే సారయ్య, మాజీ పిఎస్ఈఎస్ చైర్మన్ అచ్చా వీరేష్ బాబు, ఎం సిపిఐ నాయకులు నర్ర ప్రతాప్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సంగారబోయిన విజయ్, కాంగ్రెస్ అధ్యక్షులు బోయిన దూడయ్య, బెడద వీరన్న సిపిఐ నాయకులు గన్నారపు రమేష్ లు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తూర్పుకోట ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు నేటితో ఆ కోరిక తీరిందని తూర్పు కోటలో కులాలకు మతాలకు వ్యతిరేకంగా అందరూ బంధువుల్లా కూడి ఉంటారని నేటి నుండి అంబేద్కర్ స్ఫూర్తితో గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోనియాడారు. అనంతరం విగ్రహ దాత మైదం ప్రభాకర్, మైదం ప్రకాష్ కుటుంబాలకు అతిథుల చేత సన్మానించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఆదర్శనగర్ కాలనీ పెద్దలు మరియు వివిధ పార్టీల నాయకులు మీసాల ప్రకాష్, క్యాతం రవీందర్, బాల్ ని సురేష్ కార్పోరేటర్, కుర్మిళ సంపత్, క్రాంతి, వేణు, రాజు, సంగారబోయిన చందర్, బంగారు శ్రీనివాస్, అల్లం కేశవరాజ్, బోలుగొడ్డు శ్రీనివాస్, హర్షం రాంబాబు, సిరా బోయిన ఎల్లయ్య సార్, జెట్టబోయిన స్వామి సార్, కలకోట్ల కుమార్, గొర్రె శేఖర్, బరిగల ప్రభాకర్, బరిగల రవీందర్, భోలేశా, రాంబాబు పత్రీ, సంఘర్బోయిన రాజేష్, బిల్ల కిషోర్, కోడూరు యాకోబ్, మాదాసు మధు, మైదం లత అభిషేక్, చుక్కా రాజు, బేర వేణు,మంద శ్రీధర్ రెడ్డి, గన్నారం రఘు బరిగేల శ్రీను, బరిగేలా పూర్ణ, బరిగల అరవింద్ లతోపాటు అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ యూత్ జన్ను రాజు గన్నారపు రాజేష్ కలకోట్ల కరుణాకర్ బరిగల విక్రం ఆరూరి క్రాంతి గన్నారపు అన్వేష్ గుండేటి మధు మిద్దపాక రాకేష్ గన్నారపు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అంబేద్కర్ జయంతి

**వరంగల్ సిటీ, మన చౌరాస్తా :** స్థానిక 32,33వ డివిజన్ల పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఘనంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి జీవన్ మాట్లాడుతూ అంబేద్కర్ దేశంలో కుల వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేసినారు. అంతేకాకుండా భారత రాజ్యాంగాన్ని వ్రాసి దేశానికి దిక్సూచిగా ఉన్నారు. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే వ్యవస్థలన్నీ భారత రాజ్యాంగ పరిధిలోనే వారి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అటువంటి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నది. కార్మికుల 8 గంటల పని కోసం, ప్రసూతి సెలవుల కోసం ఎంతో కృషి చేశారు. అంబేద్కర్ గొప్పతనాన్ని వివరిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో జవాన్లు సారంగం, కిరణ్, శ్రీను, మరియు పారిశుధ్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో...

నర్సంపేట, మన చౌరాస్తా : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నర్సంపేట అంబేద్కర్ విగ్రహానికి ఏసీపీ, సీఐలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీస్ శాఖ వారు ఏసీపీ సీఐ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని సురక్షితంగా ప్రయాణం చేస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కానిస్టేబుల్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు దళిత ప్రజా సంఘ నాయకులు అభ్యుదయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నన్నపనేని



**కాశీబుగ్గ, మన చౌరాస్తా:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కాశిబుగ్గ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా కార్యక్రమానికి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా, ప్రముఖ సంఘ సంస్కర్తగా, ఆర్థికవేత్తగా మరియు న్యాయవాదిగా దేశానికి అపార సేవలు అందించారని తెలిపారు. ఆయన అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడి, దళితులు మరియు మహిళల హక్కుల సాధనకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. అంబేద్కర్ స్వతంత్ర భారతదేశపు తొలి న్యాయశాఖ మంత్రిగా సేవలందించారని, సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణకు ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వరంగల్ జిల్లాలో నూతన కలెక్టర్ గాని హాస్పిటల్ గాని దళిత బడుగు బలహీన వర్గాల కోసం వారికి అందుబాటులో ఉండేలా నియోజకవర్గంలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది వరంగల్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్య వైద్య సేవలు అందేలా ఆనాడు రూపకల్పన చేయడం జరిగినది ఏ పార్టీ అధికారంలో ఉన్న దళితులు గాని బడుగు బలహీన వర్గాలకు ఒరగపెట్టినటువంటి చరిత్ర ఏమీ లేదు కేవలం టిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వం లోని వారి అభ్యున్నతి కోసం అనేక రకమైన సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఒక్క కేసీఆర్ గారికి దక్కుతుంది . అని తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు,ముఖ్య నాయకులు, పట్టణ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# కుర్చపల్లిలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవనికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించడంతో పాటు 25లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల ప్రాతిపదికన రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను మతం పేరుతొ తొలగించడం సరైంది కాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, స్థానిక సర్పంచ్ బైకాని రాజు, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# డ్రాగన్ మూవీలో ఆలియా భట్ ?

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి 'డ్రాగన' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన 'ఆరఆరఆర్ చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా 'కలరిపయట్టు' వంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై`వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్`ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**